ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి

ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం..

▶ 4లో

'మించాల'కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల మున్సిపల్ చైర్మన్‌గా 'మించాల'

▶ 4లో

మైక్రో ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి

- డ్వాక్రా మహిళల నుంచి అక్రమ వసూళ్లను నిలిపేయాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-రేపల్లె

మహిళలపై మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలు, వివిధ మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీలతో రుణాలు పొందిన బాధితులు, పట్టణంలో పలు డ్వాక్రా సంఘాల లీడర్లతో 'మైక్రో ఫైనాన్స్ అప్పులు, అధిక వడ్డీలు, డ్వాక్రా మహిళలు దగ్గర అక్రమ వసూళ్లు' అనే అంశంపై ఎన్టీఆర్ నగర్, దేవుడు చెట్టు వద్ద బుధవారం నాడు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఐద్వా రేపల్లె పట్టణ నాయకులు కే. నాంచారమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల వద్ద నుంచి మెప్మా అధికారులు అక్రమ వసూళ్లను నివారించాలని డిమాండ్ చేశారు. పేదలను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు దోపిడీ చేస్తున్నాయని, నిబంధనల ప్రకారం మైక్రో రుణాలు ఇచ్చే సంస్థలు జిల్లా కలెక్టర్ పరిధిలో నమోదయి ఉండాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అతి తక్కువ 25 పైసల నుండి 2 రూపాయల లోపు ▶ 2లో

పుస్తక మహోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఆగస్టు 15 నుండి

ఒంగోలులో పుస్తక మహోత్సవం

▶ 8లో

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, గోనెపల్లి గ్రామాల్లో ఎఒ కె.రాజశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్ లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు సొంతగా పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు.కంది, సజ్జ, మినుములు, నువ్వు, మిర్చి పంటలకు బీమా చెల్లించేందుకు ఈనెల ఆఖరు వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. వరి పంటకు ఆగస్టు 15 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.శిరీష, పి.కౌసర్, రైతులు పాల్గొన్నారు.

పొదిలి : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథక రైతుల వాటా ప్రీమియం రైతులే చెల్లించాలని దర్శి వ్యవసాయ సంయుక్త సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని మాదాలవారిపాలెం, ఓబులక్కపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతు వాటా ప్రీమియంను రైతులే సొంతగా చెల్లించాలన్నారు. వరి,కంది, సజ్జ, నువ్వు, మినుములు, పత్తి, ఎండుమిరప పంటలుకు పంట బీమా పథకం కింద ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసులు, గ్రామవ్యవసాయ సహాయకులు పి.సుమన్ సుకుమార్, రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : మండల పరిధిలోని గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధ్భంగా రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, అరటి పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం రైతు సేవ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ మాట్లాడుతూ ఈ పంట నమోదు నందు పంట సాగు చేస్తున్న ప్రతి ఒక్క రైతు తప్పక నమోదు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఒ కె.నీరజ, ఎఇఒ డి ధనేశ్వర్ నాయక్, సిబ్బంది మీరావలి, వెంకటేశ్వర్ నాయక్, రెడ్డి నాయక్, శ్రీలక్ష్మి, రైతులుపాల్గొనారు.

పెద్ద దోర్నాల : మండల పరిధిలోని నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ జవహర్ లాల్ నాయక్ రైతులు సాగుచేసిన మొక్కజొన్న, ఆముదం పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మందయ్య, జయప్రకాశ్ , గ్రామ పెద్ద శేఖర్, రైతులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట : ఎరువుల దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఎఒ అబ్దుల్ రఫీక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎంపి చెరువు మరియు ఖాజీపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మొక్కజొన్న విత్తన ఉత్పత్తి కోసం సాగు చేసే రైతులు విత్తనొత్పత్తి కంపెనీ ప్రతినిధుల నుంచి అగ్రిమెంట్ తీసుకున్న తర్వాతనే సాగు చేయాలన్నారు. ఎరువుల దుకాణాల వద్ద తీసుకున్న రసీదులు, ప్యాకెట్లను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం వరి, కంది , ఎండు మిర్చి, మినుము సజ్జ పంటలను ఎంపిక చేసినట్లు తెలిపారు. రైతులు తాము చేసిన పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లిచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.ఆది గణేష్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, ఎం. బాలకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రాచర్ల

మండల పరిధిలోని అనుమవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కనుమర్ల రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌ను ఆసుపత్రి సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ రమేష్ ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

లైంగిక నేరాలు, సైబర్ మోసాల నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఈ విషయాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఎంఇఒ పి. ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సిలో ప్రధానోపాధ్యాయులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఫోక్సో చట్టం అమలులో ఉంద న్నారు. దీనిపై అవగాహన కల్పించాలన్నారు. నేటి కాలంలో కంప్యూటర్, మొబైల్ వాడకంలో పెరిగిన సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఎస్ఐ చౌడయ్య మాట్లాడుతూ ఫోక్సో చట్టం అనేది పిల్లలను లైంగిక దాడుల నుంచి రక్షించేందుకు రూపొందించబడిన ప్రత్యేక చట్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ నాగేంద్ర, ఎంఇఒ-2 మల్లూ నాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎల్స్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ఆంజనేయులు

విద్యార్థుల సంక్షేమానికి కృషి : కందుల

ప్రజాశక్తి- పొదిలి

విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి తెలిపారు. తల్లికి వందనం కార్యక్ర మంలో భాగంగా పొదిలి, మాదిరెడ్డి పాలెం గ్రామాలలో విద్యార్థులు తల్లిదండ్రులతో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి పట్టణంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మాధవి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు విద్యార్థుల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయక త్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించేందుకు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ఎంతో కషి చేస్తుందన్నారు. అనంతరం చంద్ర బాబు చిత్రపటానికి పాలాభిషేకం పాలాభిషేకం చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ సయ్యద్ ఇమామ్ సా, నాయకులు యర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా కుర్దుష్, దోర్నాల అంజిరెడ్డి, షేక్ రసూల్, కాటూరి శ్రీను, గౌస్ బాషా, ఒగ్గు వెంకటరామయ్య, ఆరిక రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్య ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సుద్దకురవ గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెడ్ మాస్టర్ వాగ్య నాయక్‌చ డాక్టర్ శ్రీనాధ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పిల్లల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిహెచ్ నాగులమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతిబాయి, ఆశా కార్యకర్త మేరీబాయి, సార్డ్స్ బాల ప్రకాశం ప్రాజెక్టు ఎంఅండ్ఇ అధికారి డేవిడ్ జోషి, క్లస్టర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ కె. ధర్మ నాయక్ పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

వడ్డీ వసూలు చేయాలని, కానీ రూ.10 నుంచి రూ.15 వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి లోన్లు తీసుకున్న వాళ్ల ఇళ్ల వద్దకు వచ్చి వేధింపులు పాల్పడుతున్నారని, కోర్టుల అనుమతి లేకుండా ఇళ్ల వద్ద బోర్డులు వేస్తున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా సాయంత్రం 6 తర్వాత కూడా మహిళలకు ఫోన్లు చేస్తూ.. వారి ఇళ్ల వద్దకి వెళ్లి వేధిస్తున్నారని చెప్పారు. డ్వాక్రాలో కింద స్థాయి ఉద్యోగుల దగ్గర నుండి పై స్థాయి అధికారుల వరకు పలుచోట్ల అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. రేపల్లె పట్టణంలో కూడా మెప్మా అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా బయటకు చెబితే డ్వాక్రాలో నుంచి తొలగిస్తామంటూ భయపెడుతున్నారని చెప్పారు. డ్వాక్రాలో అవినీతి వల్ల అనేకమంది మహిళలు డ్వాక్రా సేవలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా డ్వాక్రాలో లోన్ పొందాలంటే సోలార్ విద్యుత్ కనెక్షన్ పెట్టుకుంటామని అంగీకరించి... రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే అంటూ బలవంతం పెడుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా మహిళలపై మైక్రోసంస్థల వేధింపులు ఆపాలని, అధిక వడ్డీలను అరికట్టాలని ఈ నెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న విజయవాడలో రాష్ట్రవ్యాప్త సదస్సు జరుగుతుందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు మరియు డ్వాక్రాలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్, ఐద్వా రేపల్లె పట్టణ నాయకులు, కాలనీ అభివద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, సభ్యులు ఎస్‌కే.ఫర్జానా, స్వావమ్మ, వనజాక్షి, ఇతర ప్రజాసంఘాల నాయకులు కేవీ.లక్ష్మణరావు, డి.అగస్టిన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి 'కోర్టులో

O.S.No. 89/2024

మధ్యన
1.బొప్పుడి జోష్వీ కీర్తిక మరియు ఇంకొకరు ..... వాదులు
(Being Minors rep. by their next friend Guardian mother Smt. Boppudi @ DevineniBrahmani)

Vs.

1.బొప్పుడి రవీంద్రబాబు మరియు ఇతరులు ...ప్రతివాదులు

To
D3): బొప్పుడి @ కరి సుమలత
W/o కరి బాలాజీ, వయసు 33 సం.
D4): కరి బాలాజీ S/o వెంకటస్వామి
వయసు 38 సం.,
R/o గంగవరం గ్రామం H/o ఇంకొల్లు,
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.

పై దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిని మీరు వాటిని తీసుకొనక ఉద్దేశ్య పూర్వకముగా త్రిప్పి పంపుచున్నందువలన కోర్టువారు మీ హాజరు నిమిత్తము పై దావాను తేది 23-07-2025కు వాయిదా ఈప్రకటన ద్వారా వేశారు. కావున మీరు పైతేదిన పై కోర్టువారి ఎదుట ఉదయం గం. 10-30 ని.లకు స్వయంగాగాని వకీలు ద్వారా గాని హాజరయి పైదావాలో మీఆక్షేపణలు తెలుపు కోనేది. లేనిఎడల సదరు దావాను మీపరోక్షమందు తీర్మానించెదరని తెలుసుకొనేది.

// శ్రీయుత కోర్టువారి ఉత్తర్వులతో //

దాచేపల్లి హయగ్రీవాచారి M.A., LLB
వాది తరుపున న్యాయవాది.
సెల్ నెం : 9885874645

మహారాజ శ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పి. నెం.5/2025

కొన్నెబోయిన నాగయ్య .... పిటిషనర్

Vs

కొన్నెబోయిన ఆదినారాయణ... రెస్పాండెంట్లు మరియు ఇతరులు

టు:
రెస్పాండెంట్ నెం 32:
కొన్నెబోయిన ఆంజనేయులు, తండ్రి :లక్ష్మయ్య
ఆర్/ఓ. చందవరం గ్రామం, దొనకొండ మండలం, ప్రకాశం జిల్లా.
రెస్పాండెంట్ నెం.36:
దూదిపల్లి నారమ్మ, భర్త: పెద్ద వెంకట నరసయ్య
ఆర్/ఓ. ఎండ్రుపాలెం గ్రామం, త్రిపురాంతకం మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబర్ గల పిటిషన్‌లో రిజిస్టర్ పోస్ట్ ద్వారా మీకు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారు పైపిటిషన్‌లో మీ యొక్క నోటీసుల నిమిత్తం తేదీ: 21-07-2025కి వాయిదా వేసినారు. సదరు తేదీన మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై కోర్టులో ఉదయం గం 10.30లకు హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు పైకేసు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 21-07-2025

ఇట్లు
గడ్డి శ్రీనివాసులు
పిటీషనరు తరపు న్యాయవాది
దరిశి ప్రకాశం జిల్లా.
సెల్:9441125875

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No :134/2024
in
O.S No : 281/2023

నంద్యాల లక్ష్మి .. డిహెచ్ఆర్
యెదరి
మూరం తిరుపతి రెడ్డి .. జెడిఆర్

టు,
జెడిఆర్ చిరునామా
మూరం తిరుపతి రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి,
ఎక్స్ ఆర్మి, నరవ రోడ్డు, గిద్దలూరు పట్టణం,
మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్‌లో పిటిషన్ పరిహారం కొరకు డిహెచ్ఆర్ మీపై పిటిషన్ దాఖలు చేసి యున్నందున, మీకు నోటీసు నిమిత్తము17-07-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 17-07-2025 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 17-07-2025

ఇట్లు
పిడతల రాజశేఖరరెడ్డి,
డిహెచ్ఆర్ పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA No : 326/2024
in
O.S.No : 248/2024

మండ్ల కృష్ణ .. వాది
యెదరి
మండ్ల వెంకటేశ్వర్లు మరియొకరు .. ప్రతివాదులు

2వ ప్రతివాది చిరునామా
మండ్ల రాములు తండ్రి వెంకటయ్య,
అంకాలమ్మ తిప్ప వీధి, కంభం గ్రామం,
కంభం మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబర్ దావా మరియు పిటిషన్‌లో మీపై పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు నోటీసు నిమిత్తము17-07-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ17-07-2025 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీవకీలు గారి ద్వారా గాని పైకోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావా మరియు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 17-07-2025

ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
పిటిషనర్ పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజ శ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No:48/2025
in
O.S. No:5/2025

రాగి విజయ్ కుమార్ ... పిటిషనర్/వాది
వర్సెస్
దుడ్డు యలమంద ... రెస్పాండెంట్/ప్రతివాది

To,
దుడ్డు యలమంద, తండ్రి దేవ సహాయం,
R/o శివరాయునిపేట గ్రామం & మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా.

అనువారికి పై నెంబరు దావాలో నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు పలుమార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయు చున్నందున మీ హాజరు నిమిత్తం వాయిదా తే.11-08-2025ది అయిఉన్నది. కావున పై తేదీన ఉదయం గం.10- 30 ని.లకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ :11-08-2025
తేదీ,:16-07-2025 **ఇట్లు**

బోడిగారి వెంకటేశ్వర్లు, బి.ఏ.ఎల్.ఎల్.బి,
అడ్వకేట్,
పొదిలి,ప్రకాశం జిల్లా.
సెల్ :9985436688

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కనిగిరి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభలు ఆగస్టు 12, 13వ తేదీలలో కనిగిరిలో జరుగుతున్నాయని, ప్రజలు అన్ని విధాలా సహకరించి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పూసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన మహాసభల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య తన స్వగ్రామమైన అలగానిపాడులో 1934లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని తెలిపారు. నేడు అది దేశవ్యాప్త సంఘంగా రూపొందిందని అన్నారు. కనిగిరి ప్రాంతంలో గుజ్జుల ఎలమందారెడ్డి, సూరా పాపిరెడ్డి, జిల్లా తూర్పు ప్రాంతంలో తవణం చెంచయ్య లాంటి ఎందరో పోరాట యోధులు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపారని తెలిపారు. కనీస వేతన చట్టం, భూ సంస్కరణల చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఉపాధి హామీ లాంటి అనేక చట్టాలు పోరాటాల ద్వారానే సాధించుకోబడ్డాయని తెలిపారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ద్వారా వందలాది ఎకరాలు పేదలకు భూములు సాధించబడ్డాయని తెలిపారు. పాలకుల విధానాల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకు పోయిందని, ఒక వైపు రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మరోవైపు కనీస వేతనాలు, విద్య, వైద్యం లాంటి అవసరాలు తీరక గ్రామీణ పేదలు పట్టణాలకు వలస బాట పట్టారని అన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి స్థితిలో గ్రామీణ పేదల చైతన్యాన్ని పెంచి, ప్రజా ఉద్యమాలను పెంపొందించేందుకు ఈ మహాసభలు జరుగుతున్నాయని, ఈ సభల జయప్రదానికి ప్రజలు అన్ని విధాల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.వి.కొండారెడ్డి మాట్లాడుతూ కార్మిక, కర్షక ఐక్యతతోనే అసమానతలు లేని సమానత్వ వ్యవస్థ సాధ్యమవుతుందని తెలిపారు. వామపక్ష ఉద్యమాల చరిత్ర గలిగిన కనిగిరి ప్రాంతంలో ఇటువంటి మహాసభలు జరగడం సంతోషదాయకమని అన్నారు. కనిగిరి ప్రాంతం పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా నిత్యం కరువుకు గురవుతున్నదని, ప్రాజెక్టులు పరిశ్రమల నిర్మాణం జరగక వలసలకు నెలవుగా మారిందని అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వాటి నుండి బయట పడేదుకు కార్మిక కర్షక ప్రజాసంఘాలు పాలకులపై నిర్వహించిన ఉద్యమాలు ప్రజలకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయని అన్నారు. ఇలాంటి మహాసభలకు ప్రజలు సహకరించే సాంప్రదాయం ఉందని, మహాసభల విజయవంతానికి అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పిసి.కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయళ్ళ మాలకొండయ్య, ప్రజాసంఘాల నాయకులు వి.మాలకొండారెడ్డి, యు రాజ్యలక్ష్మి, కె.ప్రసన్న, కె.మాల్యాద్రి, మహేష్, పాండు, కె.యోబు, వై.వీరనారాయణ, జి.శ్రీనివాసరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల రోజులుగా కార్మికులు పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ముందుగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు తమ సమ్మెలో భాగంగా పట్టణములో మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల మొండిగా వ్యవహరిస్తూ కాల యాపన చేస్తుందన్నారు. గత్యంతరం లేక కార్మికులు సమ్మె బాట పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలేటి ఏడుకొండలు, పాటిబండ్ల పద్మ, నాయకులు టి.నరసయ్య, పి.కోటేశ్వరరావు, ఈ.నాగయ్య, బి.ఏడుకొండలు, జె.పిచ్చయ్య, గోవిందు, ఏ.కోటేశ్వరరావు, చెన్నమ్మ, విజయ, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసి కేశవరావు

సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలి

ప్రజాశక్తి-కనిగిరి

మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం సమ్మెలోకి దిగారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొని నిరసన తెలియజేశారు. కనిగిరి పట్టణంలోని ప్రధాన వీధులలో నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు పారిశుధ్య కార్మికులు లేరని అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి కానుకలు ఇవ్వాలని, పనిముట్లు అందజేయాలని, దుస్తులు పంపిణీ చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్మికులకు పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్, సిఐటియు నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఓలకు శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

మండల బూత్ లెవల్ అధికారులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గం ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి అరవ కుమార్ మాట్లాడుతూ హౌస్ టు హౌస్ సర్వే చేసి చనిపోయిన వారి ఓట్లు, డబల్ ఓట్లు, పర్మినెంట్‌గా షిఫ్ట్ అయిన వారి ఓట్లు గుర్తించాలన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడకుండా సర్వే చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న బిఎల్ఓలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి, తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం

ఎంఈవో రాజాల కొండారెడ్డి

ప్రజాశక్తి-సిఎస్ పురం

గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సిఎస్.పురంలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాలను ఆరెపాలెం పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలలో వెనుకబడిన పిల్లల కోసం ఎస్సీఇఆర్‌టి నిర్దేశించిన రెమెడియల్ బోధనను ఆచరించాలని సూచించారు. ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఒకటి రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంథోని, సిఆర్‌పి సతీష్ పాల్గొన్నారు.

మండువ మురళీ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, నాయకులు

మండవ మురళీకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రముఖ పారిశ్రామికవేత్త, కమ్మవారి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ జన్మదిన వేడుకలు ఒంగోలు లోని బృందావనం కళ్యాణ మండపంలో బుధవారం అట్టహాసంగా జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, వ్యాపారవేత్తలు శాలువాలతో, భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు హాజరై మండవ మురళీకృష్ణతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ మంచివానిగా, అందరివాడిగా మండవ మురళీకృష్ణ ఎదిగారని, తన సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆప్తుడయ్యారని తెలిపారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతోమంది తనపై ఉంచిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు నూకతోటి శరత్ ఆధ్వర్యంలో శరత్ టాక్ షోయూట్యూబ్ ఛానల్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రారంభించి అభినందనలు తెలియజేశారు. మండవ మురళీకృష్ణ తనయుడు యువ పారిశ్రామికవేత్త మండవ సాయి సుందర్, గుండ్లకమ్మ సాహిత్య సేవా సమాఖ్య అధ్యక్షులు మండవ సుబ్బారావు, పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

మస్టర్లలో మాయాజాలం

సామాజిక తనిఖీలో వెల్లడి - అధికారులపై పిడి ఆగ్రహం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. శింగరాయకొండ మండలంలోని 10 గ్రామపంచాయతీలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో మస్టర్లలో మాయాజాలాలు వేతనాల్లో తికమకలే ఎక్కువగా కనిపించాయి. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికకు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్ ఏపీడీ సుబ్బారావు, ఎండిఓ డి.జయమణి, ఎస్ఆర్ పి.నాగరాజు, ఏపీవోలు సుభాషిని, సుధాకర్లు హాజరయ్యారు. మూలగుంటపాడులో ఇరిగేషన్ కాలవలు ఉపాధి హామీలో బిల్లులు చేసుకున్నారని వెల్లడించారు. కాలువలు తీసేటప్పుడు ఓ కొలతలు, తరువాత మరో విధంగా కొలతలు ఉన్నాయన్నారు. బింగినపల్లిలో ఫారం పాండ్ల జెసిబిలతో పని చేయించినట్లు తెలిపారు. కలికివాయిలో పూర్తిస్థాయిలో రికార్డులు ఇవ్వలేదన్నారు. ఊళ్ల పాలెంలో హాజరు దిద్ది వేతనాలు ఇచ్చినట్లు గుర్తించారు. కనుమళ్లలో కొలతల్లో తేడాలు రావడంతో పిడి ఒక్కసారిగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో కూర్చొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టిఏలు, ఈసీలు మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. పాకలలో కూడా కొలతలు తేడాలు ఉన్నాయని గుర్తించారు. సోమరాజు పల్లి పంచాయతీలో పనికిరాకుండా డబ్బులు ఇచ్చినట్లు గుర్తించారు. శింగరాయకొండ, శానంపూడి గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. పాత శింగరాయకొండ గ్రామంలోనూ మస్టర్లలో తేడాలు వేతనాల్లోనూ ఇబ్బందులు గురించి వివరించారు. ప్రజా వేదిక గ్రామసభ పూర్తి అయినా తర్వాత పిడి జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కొనసాగాలంటే నియమ నిబంధనలతో పని చేయాలన్నారు. ఇష్టం వచ్చినట్టు పనిచేస్తే ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని తొలగించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. కొలతల్లో తేడాలు, మస్టర్లలో తికమకల గురించి విచారణ జరిపి బాధ్యులకు షోకాజు నోటీసులు ఇస్తామన్నారు.

మాట్లాడుతున్న పీడీ జోసెఫ్ కుమార్

డ్వాక్రా సంఘాల్లో అవినీతిని అరికట్టాలి

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీ

ప్రజాశక్తి-పామూరు

డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీమ్ అన్నారు. ఐద్వా సమావేశం భానుమతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ షమీమ్ మాట్లాడుతూ. మండలంలో వెలుగు కార్యాలయం అవినీతి కార్యాలయంగా మారిందన్నారు. మహిళలు రూపాయికి రూపాయి పోగు చేసుకుని కట్టుకున్న డబ్బుకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఇటీవల కాలంలో గోపాలపురం గ్రామానికి చెందిన గ్రూప్ సభ్యులు వద్ద లక్షల రూపాయలు అవినీతి జరిగిందని, వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే అవినీతిపై సమగ్రంగా విచారణ జరిపి సంబంధిత అధికారులను సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఒక మహిళపై నిర్బంధం చేయడం ప్రైవేటుగా విచారం చేయడం సరైనది కాదని, అవినీతి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపులకు న్యాయం చేయాలని లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూపు మహిళలను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే సంఘం మండల మహాసభలు జిల్లా మహాసభలు జరుగుతాయని మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాలు మదారమ్మ, అంకమ్మ, ఖాదర్ ఉనీషా, మస్తానమ్మ, రజియా, మై మున్ని, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షమీ

రోజుకు వెయ్యి పొగాకు చెక్కులు కొనాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి- పంగులూరు

నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రంలో రోజుకు వెయ్యి పొగాకు చెక్కులు కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంగులూరులో జరిగిన పొగాకు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నల్లబర్లి పొగాకు రైతులను మోసం చేస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఈ ఏడాది విపరీతంగా నల్లబర్లి పొగాకు సాగైందని, ఈ పొగాకును అమ్ముకునేందుకు రైతులు నెలలు తరబడి ఎదురు చూస్తున్నా కాని ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నామ మాత్రంగానే కొనుగోలు చేస్తున్నాయని అన్నారు. కనీసం రోజుకు వంద, నూట యాభై చెక్కులకు మించి కొనుగోలు చేయటం లేదని అన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించేటప్పుడు రోజుకు 300 నుండి 500 లోపు చెక్కులు కొనుగోలు చేస్తామని, మూడు రోజుల్లోనే రైతులకు డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారని, అయితే ఆ హామీలు ఏమి అమలు జరగటం లేదని చెప్పారు. రైతులు ఐదు నెలల నుండి పొగాకును మండేలు కట్టి ఉంచారని, అది ఈ

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

పాటికి పనికి రాకుండా చెడిపోతుందని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు సాంద్రతను పెంచి, త్వరగా కొనుగోలు చేయకపోతే పొగాకు దేనికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని చెప్పారు. కౌలు రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి ఉందని అన్నారు. పొగాకు కొనుగోలును అధికారులు వ్యాపారంలా చూస్తున్నారని, రైతుల సమస్యలను పరిష్కరించేదిగా చూడటం లేదని అన్నారు. నాణ్యత పేరుతో పొగాకు చెక్కులను వెనక్కి పంపడం సరైనది కాదని అన్నారు. మూడవ గ్రేడ్‌ను వెనక్కి పంపితే రైతులు ఏమి చేసుకోవాలని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో అనేక లోపాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారని, వాటిని సరి చేసుకొని త్వరగతిన పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు చేయాల్సిన రైతుల పేర్లతో కూడిన లిస్టును రైతు భరోసా కేంద్రంలో పెట్టాలని డిమాండ్ చేశారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో రైతులకు మెసేజ్లు పంపకుండా, వారికి ఇష్టం వచ్చిన వారికి ఫోన్లు చేసి, పొగాకు చెక్కులు తెప్పించుకుంటున్నారని అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ రైతులు ఉద్యమించనిదే ప్రభుత్వం కొనుగోలు సక్రమంగా జరపదని, సకాలంలో డబ్బులు చెల్లించరని అన్నారు. రైతుల వద్ద ఉన్న పొగాకును రోజుకు 1000 పొగాకు చెక్కులు కొనుగోలు చేయాలని, డబ్బులు వెంటనే చెల్లించాలని, నిబంధనల పేరుతో చెక్కులను వెనక్కి పంపరాదని నినాదాలు చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు నాయపాము ప్రభాకర్, పి రాజయ్య, విప్పర్ల రామారావు, డోలా ప్రభాకర్ రావు, నతానియేలు, మధుబాబు, రమేషు, బత్తుల తిమోతి, మార్పు యేసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గంగాధరరావు

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు వివిధ రకాల చదువుల్లో నైపుణ్యం సాధించాలని తిమ్మాయపాలెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి గంగాధరరావు అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీసే విధంగా వివిధ వృత్తి ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ ఎన్‌వి శివరామకృష్ణ, ఆటోమోటివ్ ఎస్‌కె అలీ, ఐటి ఈఎస్ వి యలమంద పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎన్సిసి అధికారులు

ఎన్‌సిసి సేవల పట్ల ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాల, బాలికలను విద్యార్థి దశనుండే ఎన్‌సిసి ద్వారా సేవా కార్యక్రమాలు చేసేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిపి కల్నల్ విజయ్ కుమార్ అన్నారు. ఎన్సిసి పాఠశాల, కళాశాలు, హోలీ క్రాస్, బాపట్ల కాలేజ్ ఆఫ్ సైన్స్, బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్లో 2025 - 26లో ఎన్‌సిసిలో కొత్తగా 47 మంది విద్యార్థులను తీసుకున్నట్లు తెలిపారు. హోలీ క్రాస్‌లో 25 మంది ఎన్‌సిసిలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశ్రీ, ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ కత్తి శ్రీనివాసరావు, సుబేదార్ రాకేష్ కుమార్, ఎన్సిసి బాలికల విభాగం శిక్షకులు నవ్య, నాయబ్ సుబేదార్ గిరిధర్ సింగ్ పాల్గొన్నారు.

ఉపకరణాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అద్దేపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాల్లో ఎపి సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు బ్యాటరీ చైర్లు, వీల్ చైర్లు, మూడు చక్రాల చైర్లు, వినికిడి పరికరాలు తదితర పరికరాలను ఎంఈఓ నీలం దేవరాజ్ చేతుల మీదుగా అందజేశారు. ఐఈడి విభాగం నుండి మట్ట జ్యోతి సహకారంతో సర్వ శిక్ష ద్వారా వీటిని అందజేశారు. భవితా కేంద్రంలో క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐఈడి ఉపాధ్యాయులు ఇవాంజెలియన్, రత్నాకర్, హెచ్‌ఎం రంగయ్య, సంషేర్ ఆలీ, సుభాషిని, విశ్రాంత ఉపాధ్యాయులు బోలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎంపీలతో సమావేశం

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో ఆర్‌ఎంపి, ఎంబిబిఎస్ పూర్తికాని పట్టాతో ప్రైవేటుగా వైద్యం చేసే వైద్యులతో ఈనెల 17న స్థానిక ఎన్జీఓలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ బుధవారం తెలిపారు. ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ విధిగా హాజరు కావాలని అన్నారు.

చీరాల మున్సిపల్ చైర్మన్‌గా 'మించాల'

- సాంబశివరావును ప్రతిపాదించిన ఎంపీ
- ఎక్స్ ఆఫీషియోగా హాజరైన కొండయ్య
- సాంబశివరావుకు ఏకగ్రీవ ఆమోదం
- చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం
- వైస్ చైర్మన్ల ఎంపికపై వీడని ఉత్కంఠ

ప్రజాశక్తి - చీరాల

గత నాలుగు నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు గురువారం తెరపడింది. స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాల్లులో చైర్మన్ ఎన్నిక చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి సీల్డ్ కవర్లో చైర్మన్ అభ్యర్థి పేరును శాసన సభ్యులు కొండయ్యకు అందజేశారు. దీంతో సరిగ్గా 11 గంటలకు చైర్మన్ ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. చైర్మన్ అభ్యర్థిగా 19వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావు పేరును ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ప్రతిపాదించారు. శాసన సభ్యులు కొండయ్య కౌన్సిల్ సభ్యుల ఎదుట సాంబశివరావు పేరు ప్రకటించారు. 26వ వార్డు కౌన్సిలర్ ఉప్పులూరి శోభనారెడ్డి బలపరిచారు. దీనికి కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిలిపారు. దింతో చైర్మన్ పదవిని ఆశిస్తున్న 14వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య తీవ్ర అసంతృప్తి, అసహనంతో కౌన్సిల్ నుండి బయటికి వెళ్లిపోయారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మద్యాహ్నం 12 గంటలకు జరగవలసిన వైస్ చైర్మన్ ఎన్నిక అనివార్య కారణాలతో గురువారంకు వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ సాంబశివరావుకు మంత్రి పార్థసారధి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్యతోపాటు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారాధి మీడియాతో మాట్లాడారు. అధిష్టానం నిర్ణయం మేరకే చైర్మన్‌గా సాంబశివరావు ఎంపికైనట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో ఇక నుంచి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నూతన చెర్మన్ సాంబశివరావు కృషి చేయాలని చెప్పారు. ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలకవర్గంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను అరికట్టాలనే ఉద్దేశంతో

దృవీకరణ పత్రం అందుకుంటున్న సాంబశివరావు

చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు తెలిపారు. పట్టణ ప్రజల సమస్యల ఇకనుంచి తొలగుతాయని చెప్పారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ మెజార్టీ సభ్యుల ఆమోదం, అధిష్టానం నిర్ణయం మేరకే చైర్మన్ ఎన్నిక జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా సాంబశివరావు పని చేస్తారని అన్నారు. మించాల సాంబశివరావు ఎన్నిక కావడంతో ఆయన వర్గీయులు ఆనందం వ్యక్తం చేస్తు పట్టణంలో బాణా సంచా కాల్చారు. ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, ఎన్నికల అధికారి డిఆర్ఓ గంగాధర్ గౌడ్ నూతనంగా చైర్మన్‌గా నియమితులైన మించాల సాంబశివరావుకు దృవీకరణ పత్రాన్ని అందజేశారు.

చైర్మన్‌గా మించాల ప్రమాణ స్వీకారం

నూతన చైర్మన్‌గా మించాల సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ప్రొసీడింగ్ అధికారి, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, ఎన్నికల అధికారి గంగాధర్ గౌడ్ సాంబశివరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మించాల సాంబశివరావును జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఎమ్మెల్యే కొండయ్య శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి శ్రమిస్తా : మించాల

చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి, తనపై నమ్మకంతో పదవి ఇచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్య, టిడిపి అధికార ప్రతినిధి మద్దలూరి మహేంద్ర నాద్‌కు మించాల సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి శ్రమిస్తానని, కౌన్సిల్ సభ్యుల నిర్ణయాలను గౌరవిస్తూ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని చెప్పారు.

చైర్మన్ సాంబశివరావుకు మద్దతు తెలుపుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కౌన్సిలర్లు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం

ప్రజాశక్తి - సంతమాగులూరు

కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం ఒకే రోజు 68 లక్షల మందికి రూ.8700 కోట్లు తల్లులకు అందజేశామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెంలోని సంతమాగులూరు మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడారు. పొగాకు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు రూ.270 కోట్లు మార్క్‌ఫెడ్ ద్వారా మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ జమ చేస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 207 అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5కే పేదలకు భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తామని అన్నారు. అదే రోజు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందిస్తామని అన్నారు. ఇంత మంచి పనులు చేస్తుంటే దుర్మార్గులు, దౌర్భాగ్యులు చంద్రబాబు ఎన్నికల హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని పచ్చి అబద్ధాలు మాట్లాడుతు న్నారని అన్నారు. 2014, 2019లో సిఎం చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధి తప్ప, వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. ఐదేళ్ళ సిఎంగా కొనసాగిన జగన్ మోహన్ రెడ్డి ఒక్క రోజైనా తాడేపల్లి గడప దాటి జనంలోకి వచ్చి జన సమస్యలపై దృష్టి పెట్టలేదని అన్నారు. జగన్ లాంటి దుర్మార్గపు నాయకుడిని తాను చూడలేదని అన్నారు. ఇటువంటి వ్యక్తి రాజకీయాలకు అనర్హుడని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పొగాకు, కోకో, మామిడి సాగుచేసిన రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లోని రైతులు ఇబ్బంది పడకుండా పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. జగన్ కారు కింద పడి చనిపోయిన తన పార్టీ కార్యకర్తను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. పరామర్శల తోటే కాలం గడుస్తుందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు తెలియని వైసిపిని ఎన్నికల కమిషన్ రద్దు చేయాలని అన్నారు. అడ్డరోడ్డు జంక్షన్‌లో మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, 14 మంది డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎర్రగొండపాలెం తెలుగుదేశం ఇన్ చార్జి జి ఎరిక్షన్ బాబు, నాగినేని రామకృష్ణ, అద్దంకి ఏఎంసి చైర్మన్ పద్మ, చేవూరి వాసురెడ్డి, ఆట్లా పెద్ద వెంకటరెడ్డి, అట్లా చిన్న వెంకటరెడ్డి, సర్పంచి గురు యాదవ్, ఆలూరి శ్రీనివాసరావు, బత్తుల రామకోటయ్య, డి గాలెయ్య పాల్గొన్నారు.

తాలూకా సిఐకి కంప్యూటర్ పరికరాలు అందజేస్తున్న ఎస్పి

మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోండి

ఎస్పి ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అప్‌డేట్ అవుతూ అందిపుచ్చుకోవాలని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ సూచించారు. పోలీస్ శాఖ ఆధునీకరణను లక్ష్యంగా తీసుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐసిజెఎస్2.0 (ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్) ప్రాజెక్ట్‌లో ప్రకాశం జిల్లా పోలీస్ స్టేషన్లకు ఆధునిక డిజిటల్ పరికరాలైన ఆల్-ఇన్-వన్ కంప్యూటర్లు, వెబ్ కెమెరాలు, ప్రింటర్లు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమణ కుమార్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, సిఐలు సుధాకర్, నాగరాజు, శ్రీనివాసరావు, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు మండల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దనరావు పేర్కొన్నారు. ఒంగోలు మండలంలోని ఉలిచి, బొద్దులూరివారి పాలెం, గుండాయపాలెం, దేవరంపాడు, దేవరంపాడు ఎస్‌సి కాలనీలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు. ఆయా గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యే దామచర్లకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నలమోతు బాలగంగాధర్, పోలవరపు వెంకట్రామయ్య, వెంకట శేషయ్య, చుంచు శేషయ్య, యర్రంనేని నరసింహారావు, పిల్లుట్ల సుధాకర్‌రావు, మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సంతృప్తికరమైన ఫలితం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మధ్యవర్తిత్వం సరళమైన, వేగవంతమైన విధానమని, సమస్యలను పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు సంతృప్తికరమైన ఫలితాన్ని ఇస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. బుధవారం ఒంగోలు నగరంలోని జిల్లా న్యాయస్థానం నుండి సివిఎన్ రీడింగ్ రూమ్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డు భాస్కరరావు, మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ మధుసూదనరావు

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పరిధిలోని పలు పోలింగ్‌స్టేషన్లను ఏఆర్‌ఓ, తహశీల్దార్ మధుసూదనరావు బుధవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని 61, 202, 203, 205, 206 నెంబర్ల పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల డిమాండ్లను సాధించే వరకు ఉద్యమం ఉద్యమం కొనసాగిస్తామని కార్మికసంఘ నాయకులు ప్రకటించారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నాడు ఒంగోలు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు లీపురు, పారను పక్కన పెట్టి సమ్మెలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయంవద్ద మున్సిపల్ యూనియన్ కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, నగర ఉపాధ్యక్షులు

డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

తంబి శ్రీనివాసులు, వై. రవి, ఎం. బాబు, ఆర్. శ్రీనివాసరావు, బి. బాబు, కె. వెంకటేశ్వర్లు, కె. యాకోబు, యూనియన్ కార్యదర్శి విజయమ్మ, అనిత, బందెల సుబ్బారావు, కసుకుర్తి వెంకటేశ్వర్లు, ఆనంద్, కె. మోహన్ రావు, ఆర్. రాములు, కె. సామ్రాజ్యం, పి. పద్మ, కమల, కె.వంశీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను

రోడ్డున పడేయటమేనా 'సుపరిపాలన'

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-రేపల్లె

మంచి ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటూ కార్మికులను రోడ్డున పడవేయటం సుపరిపాలన కాదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే, గత ప్రభుత్వానికీ, కూటమి ప్రభుత్వానికీ తేడా ఏమీ లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. రేపల్లె పట్టణంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి.. సిపిఎం తరపున మద్దతు తెలిపారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు గత ప్రభుత్వం వేతనాలు పెంచకుండా ఒప్పందాలు చేసుకొని మోసం చేసిందన్నారు. తాము వస్తే వేతనాలు పెంచడమే కాదని, ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు కనీసం పనిని గుర్తించి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు జిఓ నెంబర్ 36 ప్రకారం ఇవ్వమంటే కూటమి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. డబ్బులు లేవంటూ వాయి

మాట్లాడుతున్న రమాదేవి

దాలు వేస్తున్నారని, సంపదని సృష్టిస్తామని, సుపరిపాలన అందిస్తామని రోజూ ముఖ్యమంత్రి గారి మాటలు ప్రకటనలకే పరిమితమా? అని ప్రశ్నించారు. సమ్మె శిబిరంలో యూనియన్ అధ్యక్షులు డి. ప్రభాకరరావు, వర్కర్స్ ఎన్.రవి, వాసు, కె.రాఘవేంద్రరావు, సుబ్బారావు, అనూష గీత, శివ తదితరులు పాల్గొన్నారు. సమ్మె శిబిరానికి మద్దతు తెలిపిన వారిలో సిపిఎం, ప్రజా సంఘాలు, సిఐటియు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకులు సిహెచ్.మణిలాల్, కెవి.లక్ష్మణరావు, బి.అగస్టిన్, కే.రమేష్, వై.నవీన్, జి.దానియేలు, కె.వెంకట్ ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం

ఉద్యమం తీవ్రతరం చేస్తాం..

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం తీవ్రతరం చేస్తామని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు ప్రకటించారు. ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించిన సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, కూటమి నాయకులు కనీసం స్పందించలేదని విమర్శించారు. కార్మికుల సమ్మెను భగ్నం చేయడానికి మున్సిపల్ అధికారులు పోటీ కార్మికులను వినియోగిస్తున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు చర్చలకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు ఆర్టీసీ ఎన్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఎం.అయ్యపురెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్, ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, జి. రమేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కె. జాలయ్య, కె. వెంకటరావు, కె. మోహన్ రావు, సుధాకర్, ప్రసన్న, శ్రీదేవి, శివమ్మ, వెంకయ్య, ప్రతాప్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన 'బూచేపల్లి'

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం తాడేపల్లిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద

జగన్‌తో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హారికను పరామర్శించారు.

- వైసిపి ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త చుండూరి రవిబాబు కూడా వైఎస్.జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

టీడీపీ హయాంలోనే కొండపి అభివృద్ధి

దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలతో మాట్లాడుతున్న సత్య

అభివృద్ధి, సంక్షేమం కూటమి ఏడాది పాలనలోనే చేశామని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. బుధవారం నాడు టంగుటూరు మండలం, వల్లూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మారి టైం బోర్డు చైర్మన్ సత్య పాల్గొన్నారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

చంద్రబాబుతోనే 'సుపరిపాలన'

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-తర్లుపాడు

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తర్లుపాడు మండలం లోని సూరేపల్లి, తుమ్మలచెరువు, చెన్నారెడ్డిపల్లి, నాగెళ్ళముడుపు, తాడివారిపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కందుల మాట్లాడుతూ త్వరలోనే ప్రత్యేక మార్కాపురం జిల్లా సాకారం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాలపాటి వెంకట్రెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, రావి భాషపతి రెడ్డి, కంచర్ల కాశయ్య,పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి, మేకల వెంకట్ యాదవ్, తిప్పి రెడ్డి వెలుగొండ రెడ్డి, ఈర్ల వెంకటయ్య, కాలంగి శ్రీనివాసులు, కోటపాటి వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


నూనె వంశీకృష్ణను జనసేనలోకి ఆహ్వానిస్తున్న బాలినేని

జనసేనలో చేరిన నూనె వంశీకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యువ పారిశ్రామికవేత్త హరిప్రియ - సుదర్శన గ్రానైట్స్ అధినేత నూనె వంశీకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో బాలినేని వంశీకృష్ణకు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు, కాపు నేతలు పాల్గొన్నారు.

'సహకార' ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సహకార సంఘ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సంఘం (సిఐటియు) ప్రకాశం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన బుధవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. మూడు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఆఫీసులో పనిచేస్తున్న సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ తక్షణం పరిగణలోకి తీసుకొని వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మధ్యవర్తిత్వం ద్వారా న్యాయం

ప్రజాశక్తి - పర్చూరు

మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి పేర్కొన్నారు. రాష్ట్ర సంస్థ ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు, వివాదాలు పరిష్కరించుకునే మార్గాలను ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక కోర్టు నుండి బొమ్మల సెంటర్ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శాంతి, బార్ సభ్యులు జాన్ బాబు, శేఖర్, ప్రవీణ్, న్యాయవాదులు ఎం రవీంద్రనాథ్ రెడ్డి, రావి శ్రీనివాసరావు, రావి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపల్లె : మధ్య వర్తిత్వంతో త్వరిత ప్రయోజనం సమకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అన్నారు. పట్టణంలో వన్ కే వాక్ నిర్వహించారు. సామరస్య పూర్వక కేసులు పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వి దేవి సాయి శ్రీవాణి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి వి గీతా భార్గవి, జూనియర్ సివిల్ జడ్జి, గరికిపాటి వెంకట గిరిధర్, ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్ యు శ్రీనివాసరావు, కార్యదర్శి కేసన రామస్వామి, సిఐలు మల్లిఖార్జునరావు, సురేష్ బాబు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రస్తుతం సమాజంలో విచ్చల విడిగా మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం శివయ్య సూచించారు. స్థానిక బస్టాండు సెంటర్లో ఆటో డ్రైవర్లు, రిక్షా డ్రైవర్లు, దుకాణ దారులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలతో కుటుంబాలు చిన్నా భిన్నం అవుతాయని, యువత మత్తుకు బానిసై ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవ వద్దని అన్నారు. మద్యానికి, గంజా యికి బానిసై ఉంటే చిన్నగంజాంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు, దానిలో మత్తు పదార్థాల నుండి బయటపడే విధంగా తగిన అవగాహన, తర్ఫీదు అందిస్తారని చెప్పారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వ ఆదేశంల మేరకు ప్రతి నెల 3వ శనివారం 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై కార్యక్రమం చేపట్టారు. పట్టణలో 19 నుండి సింగల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించడంపై ప్లాస్టిక్ వస్తువుల హెూల్ సేల్, రిటైల్ అమ్మకం దారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్స్ పెక్టర్ డి బలరామిరెడ్డి, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనిముట్లు అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని కూచిపూడి, అమృతలూరు, పెదపూడి, మూల్పూరు పంచాయతీలకు ప్రభుత్వం నుండి మంజూరైన పారిశుధ్య కార్మికుల అలవెన్సును అందజేశారు. ఎంపిడిఓ మారుతి శేషమాంబ మాట్లాడారు. సర్పంచులు దేవరకొండ రాము, కొండముది సుశీల, కార్యదర్శులు తిరుమలరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని ఆదిపూడి పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు పనిముట్లను అధికారులు అందజే శారు. కార్మికులకు పారిశుధ్య పనులకు ఉపయోగపడే వివిధ పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ వి రామ్మోహన్రావు, ఆదిపూడి పంచాయతీ కార్యదర్శి లింగిశెట్టి కృష్ణ, కుంకలమర్రు పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఉన్నారు.

సిహెచ్సిలో ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు

ప్రజాశక్తి - వేమూరు

స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా మంజూరైన ఎక్సరే మిషన్‌ను టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు బుధవారం ప్రారంభించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సహకారంతో వైద్యశాల్లో రోగులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల చికిత్సలు అందే విధంగా వైద్యులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. డాక్టర్ సయ్యద్ జరీనా పర్వీన్ వైద్యులుగా చేరిన నాటి నుండి మెరుగైన వైద్య సేవలు అందించటమే కాక వైద్యశాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని అన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : సిపిఎం

ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో సిపిఎం కార్యదర్శి సిహెచ్ గంగయ్య

సమ్మె సందర్భంగా మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య బుధవారం మద్దతు తెలిపారు. పలువురు దళిత సంఘాల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు స్కిల్ వర్కర్లుగా అంటే సాంకేతికంగా నైపుణ్యం గల కార్మికులతో పురపాలక సంఘాల్లో విద్యుత్తు, త్రాగునీటి సరఫరా, వాహనాల డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా రకరకాల విభాగాల్లో నైపుణ్యం గల వీరితో పనులు చేయిస్తారని, వీళ్ళల్లో కొంతమందికి రూ.15వేలకు కుమించి జీతం లేదని, అన్ స్కిల్డ్ వర్కర్లకు మాత్రం తాను హామీ ఇచ్చానని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.21వేల జీతం చేశారని, నైపుణ్యం గల ఇంజనీరింగ్ కార్మికులకు మాత్రం రూ.15వేలు మాత్రమే ఇవ్వడం అత్యంత దుర్మార్గమని అన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల్లో పాలకులు, అధికారులు ఇంజనీరింగ్ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని అన్నారు. నైపుణ్యం గల ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు రూ.26వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు వీరికీ వర్తింపచేయాలని కోరారు. కంప్యూటర్లలో ఇంనీరింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు కాబట్టి ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌర సేవలు నిలిచిపోతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో కార్మికులను అదిరించి, బెదిరించి ప్రైవేటు వర్కర్లతో పనులు చేయించుకుని పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. అది సరైన పద్ధతి కాదన్నారు. ఆయా సంఘాల నాయకులతో చర్చలు జరిపి కార్మికుల సమ్మె పరిష్కారం చేయాలని కోరారు. అత్యవసర సేవలకు వినియోగించే ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో బిఎస్పి అధ్యక్షులు గుదే రాజారావు, కొచ్చర్ల వినయ్ రాజు, రోజన్ బాబు, సిఐటియు నాయకులు టి కృష్ణమోహన్, కె శరత్, మురళీకృష్ణ, హరిబాబు, రత్నం, నాని, అశోక్, ప్రమీల, నరేష్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 4వ రోజు వంట వార్పు నిర్వహించారు.. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్మికులు సమ్మె చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలి కార్మికులపై కక్ష పూరిత రాజకీయాలు చేయడం దారుణమైన విషయం అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని అన్నారు. జిఒ నెంబర్ 36 ప్రకారం స్కిల్ సెమీ స్కిల్డ్ వేతనాలు ప్రకారం ఇవ్వాలని అన్నారు. గత సమ్మెకాల ఒప్పందాలు అమలు చేయాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద వంటా వార్పు దృశ్యం

ఇళ్లు తొలగించి రోడ్డేశారని ఆందోళన

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని జమ్ములపాలెం ఫ్లైఓవర్ డౌన్ వద్ద తాతల కాలం నుంచి 80 ఏళ్లుగా బీ ఫారం పట్టా స్థలంలో మట్టి ఇంటిలో ఉంటూ టీ బంకు నడుపుకుని జీవనం సాగిస్తున్న దళితుల ఇళ్ళను దౌర్జన్యంగా తొలగించారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 3వ వార్డు రాజీవ్ గాంధీ కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబం తరపున రవికుమార్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తమ ఇంటి వెనక ఉన్న స్థలాన్ని కొత్త ఏడుకొండలు అనే కాంట్రాక్టర్ కొనుగోలు చేసి తమను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. తాము తమ స్థలాన్ని ఖాళీ చేస్తే అతని ఇంటికి మెయిన్ రోడ్డు ఫేసింగ్ వస్తుందని అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో రాజకీయ బలంతో తమ ఇంటిని అక్రమంగా కూల్చివేసి తమ స్థలంలో రోడ్డు నిర్మించారని అన్నారు. తమ స్థలాన్ని కొలిచి తమకు రోడ్డు విస్తరణలో పోగా మిగిలిన భూమిని చూపాలని అప్పటి కమిషనర్, సర్వేయర్‌ను వేడుకున్నట్లు తెలిపారు. ఈ లోపు కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాంట్రాక్టర్ తిరిగి ఇప్పటి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పంచన చేరి మునుపటిలాగే తమను అనేక

మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితుల ధర్నా

రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తమను రోడ్డు ఆక్రమించుకున్నారని, తక్షణమే తాము వేసుకున్న టెంట్ తీసివేయాలని వేధిస్తున్నారని అన్నారు. తమ స్థలంలో నిర్మించుకున్న ఎంఆర్‌పిఎస్ జెండా దిమ్మ రాత్రి 7గంటలకు టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ దళిత సంఘాల మద్దతుతో కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనిపై పరిశీలించి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఎస్పి అధ్యక్షులు గుదే రాజారావు, కొచ్చర్ల వినయ్ రాజు, రోజన్ బాబు, బాధ్యత కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని తనుబొద్దివారి పాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించచారు. సమావేశంలో ఎఒ కుమారి మాట్లాడుతూ విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గర విత్తనాలు కొనాలని అన్నారు. విఎఎ సుదర్శిని, రైతులు శేసిరెడ్డి, రామాంజనేయరెడ్డి, బాబు, శ్రీను పాల్గొన్నారు.

అమర్తలూరు : మండలంలోని కూచిపూడిలో ఎఇఒ బి మణికంఠ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పిఎంఎఫ్‌వై పంటల భీమా చేసుకోవాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.800 అక్టోబర్ 15లోగా చెల్లించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ ఎ ప్రవల్లిక పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని ఓలేరు, గొరిగపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ బి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వరి నారు మడుల్లో యాజమాన్య పద్దతులు వివరించారు. నారు మడుల్లో తగినంత నీరు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. వెద పద్దతిలో నాటిన రైతులు, వెదపెట్టిన 24 గంటల్లో కలుపు మొక్కలు రాకుండా నివారించాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇఒలు కె లక్ష్మీ ప్రసన్న, టి అఖిల, విహెచ్ఎలు జి జ్యోతి, ఎన్ కవిత పాల్గొన్నారు.

ఇంకొల్లు : హెచ్డి పొగాకు సాగు చేసిన రైతులు అధైర్యపడవద్దని ఎఒ ఎన్ మేరమ్మ తెలిపారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పొగాకు మార్కెట్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వర్షం కురిస్తే పత్తి సాగు చేసుకోవచ్చని, పత్తిలో గులాబీ పురుగు నివారణ చర్యలు వివరించారు.

కొల్లూరు : మండలలోని ఈపూరు, కొల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎఒ వి నరేంద్రబాబు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వరి నారుమడి పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇఒ ఎం ప్రభాకరరావు, బిఎన్ వంశీ, విహెచ్ఎ, విఎఎ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చర్ ఇస్తున్న బిఎస్ రావు

వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీఇంగ్ కాలేజీలో ఇసిఇ విద్యార్థులకు ఎఐ ఎనేబుల్డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై అవగాహన కల్పించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజిపై అనుబంధం పెంచుకోవటం వలన పరిశ్రమల్లో ఉత్తమంగా రాణించవచ్చని తెలిపారు. మహేంద్ర యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ బిఎస్ రావు అవగాహన కల్పించినట్లు ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ డి రాజెంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆదిపూడిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని ఆదిపూడి పంచాయతీలో సెంట్రల్ బృందం బుధవారం పర్యవేక్షణ చేశారు. పంచాయతీ ప్రాంతంలో ప్రభుత్వ భవనాలు వాటి పరిరక్షణ ఎలా ఉంది, ప్రభుత్వ భవనాల్లో మరుగుదొడ్లు సౌకర్యం ఎలా ఉంది, పంచాయతీలో వ్యక్తిగత గృహాలకు సంబంధించి మరుగు దొడ్లు పనితీరు, పంచాయితీలో పారిశుద్ధ ఎలా జరుగుతున్నాయనే అంశాలపై కేంద్ర బృందం పర్యవేక్షణ చేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో వివిధ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల బృంధం తనిఖీలు చేశారు. ఎడిఎలు పి శ్రీనివాసరావు, ఎ లక్ష్మీ ఎరువులకు సంబంధించి పారం లేనటువంటి, బయో ఉత్పత్తులకు (జీ2, జి3) షాప్ నందు పొందుపరచని దుకాణాలకు రు.41వేల విలువైన సరుకు నిలిపేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ బి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

చెరుకుపల్లి : స్థానిక గుప్తా ట్రేడర్స్, ఇతర షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. సరైన అనుమతులు లేకుండా ఎరువుల విక్రయాలు చేసేవాళ్లు ఆపివేయమని ఆదేశించారు. ఫారం ఒలో లేని రూ.1.38 లక్షల ఎరువులను అనుమతులు వచ్చిన తర్వాత అమ్మాలని ఆదేశించారు. మైలవరం ఎడిఎలు ఎం శ్రీనివాసరావు, ఎ లక్ష్మి, మోహన్‌రెడ్డి, ఎఒ ఎండి ఫారూఖ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గురువారం 17 జులై 2025



సుపరిపాలన కార్యక్రమానికి హాజరైన మంత్రి పార్ధసారది

పేద కుటుంబాలకు 'పి-4' వరం

ప్రజాశక్తి - వేటపాలెం

పి4 కార్యక్రమం దారిద్ర రేఖకు దిగువ కుటుంబాలకు వరమని గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి తొలి ఏడాది ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల అభ్యున్నతికి శ్రమిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానాల మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్, సలగల రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, బొగ్గుల పార్ధసారథి, కీర్తి పూర్ణచంద్రరావు, కీర్తి వెంకటేశ్వర్లు, చప్పిడి వెంకటేశులు, పల్లపోలు శ్రీనివాసరావు, కొత్త నాగు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌గా రాజీనామా చేస్తా

ప్రజాశక్తి - చీరాల

రాజకీయాల్లోకి వచ్చి ఉన్న ఆస్తులన్ని పోగొట్టుకున్నానని, ఏ పార్టీని నమ్ముకున్న తనకు ద్రోహం చేస్తున్నాయని, మూడు సార్లు మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి విషయంలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపిలోకి సిఎం చంద్రబాబు సమక్షంలో మొదటిగా వచ్చింది తానేనని కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య అన్నారు. ఈసారిగా కూడా తనకు చైర్మన్ పదవి దక్కలేదని, కౌన్సిలర్ పదవి కూడా రాజీనామా చేస్తానని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ ఎన్నికలో చైర్మన్‌గా 19 వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దింతో తీవ్ర మనస్థాపానికి గురైన సుబ్బయ్య కౌన్సిల్ నుండి బయటకు వచ్చి మాట్లాడారు. తను రాజకీయంగా ఎంతో నష్టపోయానని, అయినప్పటికీ చైర్మన్ పదవి దక్కలేదని పేర్కొన్నారు.

సుబ్బయ్య ఇంటికి వెళ్ళిన మంత్రి, ఎమ్మెల్యేలు

మున్సిపల్ చైర్మన్ పదవి దక్కలేదని అసంతృప్తి చెందిన పొత్తూరి సుబ్బయ్య ఇంటికి మంత్రి పార్ధసారథి, ఎమ్మెల్యే కొండయ్య, టిడిపి అధికార ప్రతినిధి మద్దతు మహేంద్ర, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీలో పని చేసిన వారికి సమచిత స్థానం కచ్చితంగా ఉంటుందని, అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని అన్నారు. అతి త్వరలో పార్టీలో క్రియాశీలకంగా ఉండే మంచి స్థానం కల్పించి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ కష్ట కాలంలో వెన్నంటే ఉన్న వారినెవరిని పార్టీ మర్చిపోదని అన్నారు. తగిన గౌరవం, ప్రాధాన్యత ఇస్తుందని ఓదార్చారు. దింతో స్థిమితబడిన సుబ్బయ్య వారితో కలసి కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు హాజరయ్యారు.

'ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు భరించలేకున్నాం..'

ప్రజాశక్తి - పంగులూరు

తామంతా సెంటు భూమిలేని నిరుపేదలమని, కౌలు వ్యవసాయం చేసుకుంటూ బతికేందుకు ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర అప్పులు తీసుకున్నామని, వ్యవసాయం కలిసి రాలేదని, పంటలు సరిగా పడటం లేదని, నష్టాలు పాలయ్యామని, ఇప్పుడు ఫైనాన్స్ సంస్థలు తమకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారని బైట మంజులూరు పేదలు తహాశీల్దారు శింగరావుకు వినతి పత్రం అందజేశారు. ఇంట్లో మనిషి చనిపోయిన తమ డబ్బులు తమకు చెల్లించాల్సిందేనని యాగి చేస్తున్నారని తెలిపారు. బాకీల చెల్లింపుకు కొంత వెసులుబాటు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో తాతపూడి గోవర్ధన, పాలపర్తి యెహోషువ, చింతల నాగార్జున, పాలపర్తి వెంకటేశ్వర్లు, పాలపర్తి నవీన్, మన్నం జయరావు, ఆలూరి ఇమ్మానియేలు, తాతపూడి చిన్నమ్మాయి, సందిపోగు నిర్మల, పాలపర్తి సీతమ్మ, తాళ్లూరి నాగేశ్వరరావు, కళ్యాణ ఇశ్రాయేలు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రణాళికలు

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం

గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వసతులు కల్పించేలా అద్భుత ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మండల అధికారులతో సమీక్ష చేశారు. ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు గుర్తించాలని అన్నారు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, మంచి నీటి సమస్యకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మురుగు నీరు నిల్వ లేకుండా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మంచి నీటి ప్రణాళికలు చేపట్టిందని అన్నారు. ప్రతి ఇంటికి పైపులైన్ నిర్మాణం చేపడుతుందని అన్నారు. అర్హులందరికీ స్థలాలు అందిస్తామని అన్నారు. మండలంలోని గొనసపూడిలో అర్హులకు ఇంటి స్థలాలు అందించేందుకు శరవేగంగా చర్యలు చేపట్టాలని తహశీల్దారు ప్రభాకరావును ఆదేశించారు. పెద్దగంజాం పంచాయతీలోని గొల్లపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. సిఎం చంద్రబాబు స్వయంగా గ్రామాన్ని సందర్శించి అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. గ్రామంలో సిసి రోడ్లు, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఇంటికి సోలార్ సిస్టం ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో తహశీల్దారు ప్రభాకర్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, పిఆర్ ఏఈ దాస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బసవ రాణి, ఏపీఓ లక్ష్మి దేవి, ఏపీఎం సుబ్బారావు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పిహెచ్‌సి సిబ్బందిపై రాష్ట్ర కోఆర్డినేటర్ ఆగ్రహం

ప్రజాశక్తి - బాపట్ల

ఇన్ని సమస్యలతో వైద్య సేవలు ఎలా చేస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ సెకండరీ హెల్త్ జిల్లా ఆసుపత్రులు కోఆర్డినేటర్ డాక్టర్ మోజేష్ కుమార్ పివిపాలెం పిహెచ్‌సి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పివిపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవపై సిబ్బందితో సమీక్ష చేశారు. అనేక రుగ్మతలతో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అనేక సమస్యలతో ఆరోగ్య కేంద్రం స్వాగతం పలకడం ఏమిటని ప్రశ్నించారు. వైద్య సేవలు అందించేందుకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అన్నారు. ఆసుపత్రిలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా లేదని సిబ్బందిపై మండిపడ్డారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. ఇకపై తీరు మార్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి హాజరు అమలు చేయడంలో వైద్యాధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపి గణనీయంగా తగ్గిపోయిందని అన్నారు. వసతులు మెరుగుపర్చాలని అన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య లోపం కనిపిస్తోందన్నారు. వార్డులు, టాయిలెట్లు, ఆసుపత్రి పరిసరాల్లో పరి శుభ్రత లోపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మహష్ కుమార్

సేద్యంలో నూతన ఒరవడికి నాంది

ప్రజాశక్తి - బాపట్ల

వ్యవసాయ రంగంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణల ద్వారా సేద్యంలో నూతన వరవడిని సృష్టించేందుకు యువ వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని నకాసా క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాగర్లమూడి చంద్రశేఖర్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అగ్రి దీక్ష హాలులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కళాశాల 8 వసంతాల అక్షర సేద్యంలో ఉభయ రాష్ట్రాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో వ్యవసాయ కళాశాల ఆవిర్భావానికి నాందీ వాచకం పలికిందని అన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రసూన రాణి మాట్లాడారు. ప్రపంచ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే బీజం పడిందన్నారు. జెనెటిక్స్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం తుషారకు ఉత్తమ పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు బంగారు పతకాన్ని బహూకరించారు. డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, బాలినేని స్వరూప రాణి వెండి పతకాన్ని డి మంజుషకు బహుకరించారు. పూర్వ అసోసియేట్ డీన్లను ఘనంగా సత్కరించారు.

వ్యవసాయ విద్యార్థులతో అతిథులు

అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్ : ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇస్తే ప్రతిపక్ష పాత్ర పోషించడానికి జగన్‌కు చేతకావడం లేదని, రాష్ట్ర అభివృద్ధికి దుష్టశక్తిలా అడ్డుపడుతున్నాడని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు పబ్జీ ఆడుకున్నట్లు ఇప్పుడు కూడా పబ్జీ ఆడుకోవచ్చు కదా! పరామర్శల పేరుతో ఎందుకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నావని ప్రశ్నించారు. రపా రపా నరికితే మంచిదే కదా సినిమా డైలాగ్ వాడితే తప్పేంటని మాట్లాడిన జగన్, వివేకం సినిమా ఎందుకు కోర్టుకువెళ్లి అడ్డుకున్నావని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను అడ్డంపెట్టుకొని వేలమందిపై తప్పుడు కేసులు పెట్టించి వేధించాడని అన్నారు. బంగారు పాళ్యంలో మామిడి రైతుల పరామర్శకు వెళ్లి నానా ఇబ్బందులకు గురిచేశాడని ఆరోపించారు. కర్ణాటక సిఎం మన సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి తమ రాష్ట్రం మామిడి కొనండని వేడుకున్నాడని గుర్తు చేశారు. సిండికేట్ లా ఏర్పడి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయాలని చూశారని అన్నారు.

బాపట్లలో కార్మికుల అర్ధనగ్న నిరసన, నిరసన

కార్మికుల అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె శరత్ మాట్లాడారు. వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పట్టించుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు గురువారం చలో విజయవాడకు తరలి రావాలని అన్నారు. జూలై 4నుండి అత్యవసర సేవలైన మంచినీళ్లు, విద్యుత్తు వంటి విధులు నిర్వహిస్తున్న కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లి ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు.

ఉద్యోగ నియామక పత్రం అందజేసిన తహశీల్దార్

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని వీరన్నపాలెంకు చెందిన జంగా అజయ్ బాబుకు తహశీల్దారు బ్రహ్మయ్యకు బుధవారం కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. వీరన్నపాలెం గ్రామ నౌకరుగా పనిచేసిన జంగా ప్రభాకర్ మృతి చెందగా అతని కుమారుడు అజయ్ బాబుకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో వైద్యులు జరీనా పర్వీన్

పిహెచ్‌సిలో అరుదైన చికిత్స

ప్రజాశక్తి - వేమూరు

వివాహమై పదేళ్లు గడిచిన వచ్చిన గర్భం నిల్వక ఎప్పటికప్పుడు పోతుండటంతో ఓ మహిళ స్థానిక సిహెచ్సి వైద్యులు జరీనా పర్వీన్‌ను ఆశ్రయించింది. 118 కేజీల బరువున్న ఆ మహిళలకు పలమార్లు గర్భం దాల్చినప్పటికీ ఎప్పటికప్పుడు గర్భం నిలబడకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఇలాంటి సమయంలో డాక్టర్ పర్వీన్ ఆమెకు చికిత్సలు చేస్తూ బరువులు తగ్గిస్తూ తగిన సలహాలు సూచనలు అందిస్తూ వచ్చింది. ఆ మహిళ మరో మారు గర్భం దాల్చగా వైద్యుల పరిరక్షణలో ఆమె ప్రసవించగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. వైద్యురాలు చేసిన చికిత్స కృషి వలన నేడు తాను బిడ్డకు జన్మనివ్వగలిగానని ఆనంది వ్యక్తం చేశారు.

సోలార్ సబ్సిడీ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పిఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వెలుగు సిబ్బందికి సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కల్పించారు. 3కిలో వాట్ సామర్థ్యం ఉన్న యూనిట్ ఏర్పాటుకు రూ.78వేల సబ్సిడీ వస్తుందని తెలిపారు. రైస్ కార్డుతో సంబంధం లేకుండా సబ్సిడీ అందుతుందని అన్నారు. ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా వాసు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సూరేపల్లి పంచాయతీలోని వేమవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు సురేపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ జంగం వాసుకు వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆయనను పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు యన్నం సురేష్, కనపర్తి సుమంత్, కౌశిక్, యలవర్తి ప్రవీణ్, కార్తీక్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుండి

ఒంగోలులో పుస్తక మహోత్సవం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలులో మూడో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, మనోహర్‌నాయుడు బుధవారం పేర్కొన్నారు. ఆగస్టు 15 నుండి 24వ తేదీ వరకు విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీ మరియు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ గ్రంథాలయ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా పుస్తక మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఆగస్టు 15 నుంచి 24 వరకు పుస్తక మహోత్సవాన్ని పివిఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో ప్రముఖ పబ్లిషర్స్ వంద స్టాల్స్ వరకు ఏర్పాటు చేస్తారన్నారు. ప్రతిరోజూ సాయంత్రం సాహిత్య, సాంస్కృతిక ఫ్లిన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీంతోపాటు సైన్స్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుక్ రీడింగ్‌పై మక్కువ పెంచాలనే ఉద్దేశంతో ఈ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు నాయక్, కార్యదర్శి ఆర్.రామకష్ణ ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి అలుగుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చీరాల కుప్పడం చేనేతలకు

జాతీయ అవార్డు అంకితం

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' పేరుతో కుప్పడం పట్టు చీరలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయస్థాయి అవార్డును చీరాల చేనేతలకు అంకితం చేస్తున్నానని కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. కుప్పడం పట్టు చీరలకు కేంద్రం ఇచ్చిన జాతీయస్థాయి అవార్డును అందుకుని బాపట్లకు చేరిన కలెక్టర్ వెంకటమురళి వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. శతాబ్దాలుగా చేనేతల కషి ఫలితంగానే కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వారు పడుతున్న కష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలు ఎప్పటి నుంచో ప్రాచుర్యం పొందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో వెలుగులోకి వచ్చిందన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలకు ఢిల్లీలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డు, గౌరవం చేనేతలకే చెందుతుందన్నారు. కుప్పడం పట్టు చీరలను ఆన్‌లైన్ వ్యాపార వేదికకు అనుసంధానం చేయాలన్నారు. సూర్యలంక బీచ్, వాడరేవు బీచ్ వద్ద, చీరాల పట్టణం, బాపట్ల పట్టణంలోని ప్రధాన కూడలిలో కుప్పడం పట్టు చీరల ప్రదర్శన, అమ్మకాలు జరపాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా సంబంధిత నాలుగు ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటుచేసి, వ్యాపారాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశమంతా ప్రాచుర్యం పొందిన కుప్పడం పట్టు చీరల ఉత్పత్తి విస్తతం కావాలని, చేనేత కుటుంబాల్లోని నిరుద్యోగులు ఆసక్తిగా చేనేత వృత్తిలోకి అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి ధరలు రావాలి, చేనేత వత్తి లాభదాయకంగా మారాలి, చేనేతలకు మరింత ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ శ్రీనివాసరావు, సిపిఓ షాలెంరాజు, డిపిఓ ప్రభాకర్‌రావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ వెంకట మురళిని సన్మానిస్తున్న వివిధ శాఖల జిల్లా అధికారులు

డ్రగ్స్‌కు బానిసలైతే బతుకు బుగ్గే..

ఎస్పీ ఏఆర్.దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాదక ద్రవ్యాలకు బానిసైతే బతుకు బుగ్గిపాలు అవుతుందని, డ్రగ్స్ వినియోగించినా, సేవించినా, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, శిక్షలు, సైబర్ నేరాలు, బెట్టింగ్ అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఒంగోలు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోతి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, ఒంగోలు సబ్ డివిజన్ సిఐలు సుధాకర్, నాగరాజు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, హాజరత్తయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్